నమస్తే తెలంగాణ

యాదాద్రి భువనగిరి

13 | హైదరాబాద్, ఆదివారం 10 మార్చి 2024 | YADADRI BHUVANAGIRI




లక్ష్మీనరసింహస్వామి కోసం నేసిన ఇక్కత్ వస్త్రాలు, పంచెను పరిశీలిస్తున్న దేవస్థాన అధికారులు

## బ్రహ్మోత్సవాలకు పోచంపల్లి వస్త్రాలు సిద్ధం

భూదాన్ పోచంపల్లి, మార్చి 9 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలకు భూదాన్ పోచంపల్లిలో చేనేత వస్త్రాలు సిద్ధమయ్యాయి. పద్మశాలి మహాజన సంఘం ఆధ్వర్యంలో లక్ష్మీదేవి అమ్మవారికి రెండు పోచంపల్లి ఇక్కత్ పట్టు చీరెలు, స్వామివారికి పట్టు దోవతులు, శాలువాలు సంబంధిత వస్త్రాలను తయారు చేయగా వాటిని గుట్ట దేవస్థానం డిప్యూటీ ఈఓ భాస్కర్‌శర్మ, ఏఈఓ శ్రవణ్ కుమార్, సూపరింటెండెంట్ శంకర్‌నాయక్ తదితరులు పరిశీలించారు. శనివారం పోచంపల్లిలోని పద్మశాలి మహాజన సంఘం భవనంలో ప్రముఖ చేనేత కళాకారులు మేకల రామకృష్ణ, పురుషోత్తం చేనేత మగ్గంపై నేస్తున్న వస్త్రాల తయారీని వారు పరిశీలించారు. లక్ష్మీదేవి అమ్మవారి కోసం ఆఫ్ వైట్ మెరూన్ అంచు చీరె, చేనేత పట్టు పంచెను వారు తిలకించి కళాకారుల నైపుణ్యాన్ని ప్రశంసించారు. స్వామివారి బ్రహ్మోత్సవాలకు పట్టు వస్త్రాలు బహూకరించేందుకు దేవాదాయ శాఖ అనుమతి లభించగా, ఈనెల 11న బ్రహ్మోత్సవాల్లో స్వామి అమ్మవార్లకు పద్మశాలి మహాజన సంఘం ఆధ్వర్యంలో పట్టు వస్త్రాలను అందించనున్నారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి మహాజన సంఘం అధ్యక్షుడు సీత శ్రీరాములు, ఉపాధ్యక్షులు బోగ నరసింహ, అంకం మురళి, ప్రధాన కార్యదర్శి భారత బాలరత్నం, సహాయ కార్యదర్శి కడవేరు చంద్రమౌళి, కోశాధికారి సంగెం చంద్రయ్య, సభ్యులు గంజి అంజయ్య, గుండు పాండు, కర్నాటి అంజమ్మ పాల్గొన్నారు.

## మద్దివానిగూడెంలో షూటింగ్

భూదాన్ పోచంపల్లి, మార్చి 9 : మున్సిపాలిటీ పరిధిలోని మద్దివానిగూడెం పరిసరాల్లో శ్రీ చక్ర మిల్క్‌కు సంబంధించిన యాడ్ షూటింగ్ శనివారం నిర్వహించారు. పంట పొలం వద్ద పాలను పితికి సైకిల్‌పై తండ్రీకొడుకులు ఇంటికి వస్తున్న సన్నివేశాలను చిత్రీకరించారు. హీరో సత్యదేవ్, చిన్నారి షణ్ముఖ‌తో కలిసి పృథ్వీ ఆదిత్య దర్శక పర్యవేక్షణలో షూటింగ్ నిర్వహించారు.



పాలను సేకరించి సైకిల్‌పై వస్తున్న హీరో సత్యదేవ్, చిన్నారి షణ్ముఖ

# రేపటి నుంచి యాదగిరీశుడి బ్రహ్మోత్సవాలు

## నారసింహుడి ఆలయం పునఃప్రారంభం తర్వాత రెండోసారి వేడుకలు

- 17న ఎదుర్కోలు.. 18న తిరుకల్యాణోత్సవం
- 21న శతఘటాభిషేకంతో ఉత్సవాలు పరిపూర్ణం
- ముస్తాబవుతున్న పంచనారసింహుడి క్షేత్రం

యాదగిరిగుట్ట, మార్చి9 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలను ఈ నెల 11 నుంచి మార్చి 21 వరకు నిర్వహించనున్నారు. ఈ నెల 11న స్వస్తివాచనం, అంకురారోపణం, విశ్వక్సేనారాధన, రక్షాబంధనంతో ఉత్సవాలు ప్రారంభంకానున్నాయి. 17న ఎదుర్కోలు, 18న స్వామి వారి తిరుకల్యాణోత్సవం, 19న దివ్య విమాన రథోత్సవం, 20న మహాపూర్ణాహుతి, చక్రతీర్థం, 21న శతఘటాభిషేకం, శృంగార డోలోత్సవంతో ఉత్సవాలను పరిపూర్ణం చేయనున్నారు. ఇందులో భాగంగా వారం రోజులపాటు అలంకార సేవలు నిర్వహించనున్నారు. ఆలయం పునఃప్రారంభమైన తరువాత రెండోసారి జరిగే వార్షిక బ్రహోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే ఆలయ శుద్ధి కార్యక్రమాలు చేపట్టారు. ముఖ మండపంలో రంగురంగుల విద్యుద్దీపాలతో తీర్చిదిద్దారు. రథశాలను సిద్ధం చేశారు. ఆలయ ప్రధాన రహదారుల్లో విద్యుద్దీపాలతో కూడిన స్వాగత తోరణాలు బిగించారు. ఈ సారి స్వామివారి కల్యాణోత్సవాన్ని కొండపైన ఉత్తరభాగం తిరుమాఢ వీధుల్లో జరిపించనున్నారు. స్వామివారి అలంకార సేవలను తిరుమాఢ వీధుల్లో ఊరేగించనున్నారు. ఈ ఉత్సవాల్లో 100 మంది పారాయణికులు, రుత్వికులు, ఆచార్యులు, పండితులు పాల్గొననున్నారు.

### 10వేల మంది భక్తులు కూర్చునే విధంగా..

ప్రధానాలయ ఉత్తర ప్రాంతంలోని వాయుదిశలో నిర్మించిన లిఫ్ట్, రథశాల ప్రాంతంలో కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. 18న రాత్రి 8 గంటలకు స్వామి, అమ్మవార్ల తిరు కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. 80 ఫీట్ల పొడవు, 45ఫీట్ల వెడల్పుతో ప్రత్యేక కల్యాణ మండపాన్ని సిద్ధం చేస్తున్నారు. కల్యాణ మండపం ఎదురుగా 10 వేల మంది భక్తులు కూర్చునే విధంగా ఏర్పాటు చేస్తున్నారు.





యాదగిరిగుట్టలో బ్రహ్మోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన స్వాగత తోరణం

### 13 నుంచి అలంకార సేవలు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా అలంకార సేవలు 13న మత్స్యాలంకారంతో ప్రారంభమై 19న శ్రీమహావిష్ణు అలంకార సేవతో పరిపూర్ణమవుతాయి. మొదటి ప్రాకార మండపంలో స్వామి వారి సేవలను అలంకరించనున్నారు. స్వామి సేవలను పశ్చిమ రాజగోపురం గుండా మాఢవీధుల్లో ఊరేగిస్తారు. కొండపైన విష్ణుపుష్కరిణిలో స్వామి వారికి చక్రతీర్థ స్నానం నిర్వహించనున్నారు. చక్రతీర్థం అనంతరం స్వామివారికి వినియోగించిన శుద్ధ జలాలను ప్రచారం రథంతో ఊరేగింపుగా వెళ్లి కొండకింద లక్ష్మీ పుష్కరిణిలో కలుపుతారు.

### మొక్కు సేవలు రద్దు

యాదగిరీశుడి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఈ నెల 11 నుంచి 21 వరకు నిత్య కల్యాణం, బ్రహ్మోత్సవం, సుదర్శన నారసింహ హోమం, మొక్కు సేవలను రద్దు చేస్తున్నట్లు ఆలయ ఈఓ రామకృష్ణ తెలిపారు. స్వామివారి రాత్రి నివేదన అర్చన అనంతరం 8.15 నుంచి 9.00 గంటల వరకు బలిహరణ, ఆరగింపు జరిపించనున్నారు. రాత్రి 7 గంటలకు అలంకార సేవలు, సర్వ దర్శనాలు ప్రారంభించనున్నారు. రాత్రి 10 గంటలకు శయనోత్సవ సేవ, ద్వార బంధనం. 17నుంచి 19వరకు భక్తులచే జరిపే అర్చనలు, బోగాలు, 20, 21 తేదీల్లో అభిషేకాలు, అర్చనలు రద్దు చేయనున్నట్లు ఈఓ చెప్పారు.

### బ్రహ్మోత్సవాల వివరాలు

| తేదీ | ఉదయం | సాయంత్రం |
|---|---|---|
| 11 | 10 గంటలకు విశ్వక్సేన ఆరాధన | 6.30 గంటలకు మృత్స్యంగ్రహణం, అంకురారోపణ, స్వస్తివాచనం, రక్షాబంధనం |
| 12 | 9 గంటలకు అగ్నిప్రతిష్ఠ, 11 గంటలకు ధ్వజారోహణం | 6.30 గంటలకు భేరీపూజ, దేవతాహ్వానం, హవనం |
| 13 | 9 గంటలకు మత్స్యావతార అలంకార సేవ | రాత్రి 7 గంటలకు శేష వాహన సేవ, వేదపారాయణాలు ప్రారంభం |
| 14 | 9 గంటలకు వటపత్రశాయి అలంకార సేవ | రాత్రి 7 గంటలకు హంస వాహన అలంకార సేవ |
| 15 | 9 గంటలకు శ్రీకృష్ణాలంకార(మురళీకృష్ణుడు) సేవ | రాత్రి 7 గంటలకు పొన్నవాహన సేవ |
| 16 | 9 గంటలకు గోవర్ధనగిరిధారి అలంకార సేవ | రాత్రి 7 గంటలకు సింహవాహన సేవ |
| 17 | 9 గంటలకు జగన్మోహిని అలంకార సేవ | రాత్రి 8.45 గంటల అశ్వవాహన సేవ, ఎదుర్కోలు ఉత్సవం |
| 18 | 9 గంటలకు శ్రీరామ అలంకారం(హనుమంతవాహన సేవ) | రాత్రి 8.45 గంటలకు గజవాహన సేవ, తిరుకల్యాణం మహోత్సవం |
| 19 | 9 గంటలకు మహావిష్ణు అలంకారం, గరుడవాహన సేవ | రాత్రి 8.45 గంటకు దివ్య విమాన రథోత్సవం |
| 20 | 10.30 గంటలకు మహాపూర్ణాహుతి, చక్రతీర్థం | సాయంత్రం 7 గంటలకు శ్రీపుష్పయాగం, దేవతోద్వాసన, దోపు ఉత్సవం |
| 21 | 10 గంటలకు అష్టోత్తర శత ఘటాభిషేకం | రాత్రి 9 గంటలకు శృంగార డోలోత్సవం |

### ప్రముఖులకు ఆహ్వానం



సీఎం రేవంత్‌రెడ్డికి ఆహ్వాన పత్రిక అందిస్తున్న ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, ఆలయ ప్రధానార్చకులు నల్లన్‌థీఘళ్ లక్ష్మీనరసింహాచార్యులు, ఈఓ రామకృష్ణారావు

యాదగిరిగుట్ట : యాదగిరీశుడి బ్రహ్మోత్సవాలకు రావాలని కోరుతూ ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్యతో కలిసి దేవస్థాన అధికారులు శనివారం పలువురు ప్రముఖులకు ఆహ్వాన పత్రికలను అందజేశారు. హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, గవర్నర్ తమిళి సై సౌందర రాజన్, ప్రభుత్వ ముఖ్య సలహాదారు శాంతి కుమారి, రాష్ట్ర దేవదాయ, ధర్మాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్‌తోపాటు వివిధ మంత్రులను వేర్వేరుగా కలిసి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశికధర్మకర్త బి. నరసింహమూర్తి, ఈఓ రామకృష్ణారావు, ఆలయ ప్రధానార్చకులు నల్లన్‌థీఘళ్ లక్ష్మీనరసింహాచార్యులు, అర్చకులు మంగళగిరి నరసింహమూర్తి, అధ్యాపకులు నల్లన్‌థీఘళ్ సీతా మనోహరాచార్యులు పాల్గొన్నారు.

## కనుల పండువగా తెప్పోత్సవం



పానగల్ ఛాయా సోమేశ్వరాలయంలో స్వామివారి తెప్పోత్సవం

రామగిరి, మార్చి 9 : మహా శివరాత్రి బ్రహోత్సవాల్లో భాగంగా నల్లగొండ పానగల్‌లోని ఛాయా సోమేశ్వరాలయంలో శనివారం ఉదయం పార్వతీ పరమేశ్వరుల పల్లకి సేవ, అగ్నిగుండాల కార్యక్రమా న్ని ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తరించారు. ఈ సందర్భంగా స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు కొనసాగాయి. ఉత్సవాల్లో భాగంగా రాత్రి హంస వాహనంపై స్వామి, అమ్మవార్ల తెప్పోత్సవం వైభవంగా నిర్వహించారు. చుట్టూ పచ్చని పొలాలు, విద్యుత్ దీపాల వెలుగుల్లో కోనేరులో తెప్పోత్సవం భక్తులను ఆకట్టుకున్నది. ఆలయ చైర్మన్ గంట్ల అనంతరెడ్డి, ఏఎస్పీ రాములునాయక్, డీఎస్పీ శివరాంరెడ్డి, రుద్రసేన, అల్లుబెల్లి తిరుమల్‌రెడ్డి, హరిబాబు, రవి, శేఖర్‌రెడ్డి, కృష్ణమోహన్ శర్మ, వెంకట్, జీవీ రావు, ఆలయ అర్చకులు ఉదయ్ కుమార్, అజయ్‌కుమార్ పాల్గొన్నారు.



పానగల్ ఛాయా సోమేశ్వరాలయంలో అగ్నిగుండాలు



కల్యాణతంతు జరిపిస్తున్న అర్చకులు

## మేళ్లచెర్వులో జన జాతర

- వైభవంగా శివపార్వతుల కల్యాణం
- ఉత్సాహంగా ఎద్దుల పందేలు

మేళ్లచెర్వు, ఫిబ్రవరి 9 : మేళ్లచెర్వులో మహా శివరాత్రి ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. శుక్రవారం అర్ధరాత్రి దాటాక ఇష్టకామేశ్వరీ సహిత స్వయంభూ శంభులింగేశ్వరస్వామి కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. ఆలయం నుంచి ఉత్సవమూర్తులను ఎదుర్కోళ్ల మహోత్సవం ద్వారా కల్యాణ మండపం వద్దకు చేర్చారు. అనంతరం యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగల్యధారణ, ముత్యాల తలంబ్రాలు తదితర ఘట్టాలను మేళతాళాలు, వేదమంత్రాలతో అర్చకులు కొంకపాక రాధాకృష్ణమూర్తి, విష్ణువర్ధన్‌శర్మ, ధనుంజయశర్మ, భానుకిరణ్‌శర్మ, శివగోపాలశర్మ ఘనంగా నిర్వహించారు. జాతర రెండో రోజు శనివారం పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. స్వామివారికి అభిషేకం నిర్వహించి పూలతో అలంకరించారు. రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర దంపతులు ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈఓ కొండారెడ్డి ఆయనను స్వామివారి శేష వస్త్రంతో సత్కరించారు. జాతరలో భాగంగా నిర్వహిస్తున్న తెలుగు రాష్ట్రాల స్థాయి ఎద్దుల పందేలు ఉత్సాహంగా నడుస్తున్నాయి. దుకాణాలు, పిల్లల వినోద యంత్రాల వద్ద జన సందడి నెలకొన్నది. టీటీడీ కల్యాణ మండలంలో భక్తులకు ఏర్పాటు చేసిన అన్నదానం రెండోరోజూ కొనసాగింది. విద్యుత్ ప్రభలపై ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ మహేంద్రకుమార్, ఆలయ కార్యనిర్వహణాధికారి గుజ్జుల కొండారెడ్డి, ఉత్సవ కమిటీ చైర్మన్ శాగంరెడ్డి శంభిరెడ్డి పాల్గొన్నారు.



ఎద్దుల పందెంలో బండ లాగుతున్న గిత్తలు

# గాడి తప్పిన పాలన

## జిల్లాలో కుంటుపడుతున్న పరిపాలన

- ఇద్దరు అదనపు కలెక్టర్ల పోస్టులు ఖాళీ
- కుప్పలు తెప్పలుగా పేరుకుపోతున్న ఫైల్స్
- నిర్ణయాలు తీసుకోపోవడంలో గందరగోళ పరిస్థితులు
- ఇబ్బందులు పడుతున్న జిల్లా యంత్రాంగం, ప్రజలు
- గిరిజన, మైనార్టీ శాఖలకు ఇన్‌చార్జిలే దిక్కు
- విద్యాశాఖకూ అదనపు బాధ్యతలే..



కలెక్టర్ కార్యాలయ సముదాయం

యాదాద్రి భువనగిరి, మార్చి 9 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో పాలన గాడి తప్పుతున్నది. కీలక నిర్ణయాలు తీసుకునే పెద్దాఫీసర్లు లేకపోవడంతో అస్తవ్యస్తంగా మారింది. కుడి భుజం, ఎడమ భుజం లాంటి ఇద్దరు అదనపు కలెక్టర్ల పోస్టులు ఖాళీగా ఉండటంతో అంతా ఆగమాగం అయ్యింది. వందల సంఖ్యలో ఫైల్స్ కుప్పలు తెప్పలుగా పేరుకుపోతున్నాయి. వివిధ అంశాలకు సంబంధించి ఎలాంటి నిర్ణయాలు తీసుకోపోవడంతో అన్ని శాఖల్లో గందరగోళం నెలకొంది. మరోవైపు విద్యా, గిరిజన, మైనార్టీ శాఖలు సైతం ఇన్‌చార్జి అధికారులతో నెట్టుకొస్తున్నారు.

### ఇద్దరు అదనపు కలెక్టర్లు ఖాళీ..

జిల్లాలో కలెక్టర్ తర్వాత కీలకమైన అధికారులు అదనపు కలెక్టర్లు. ఒకరు స్థానిక సంస్థలు, మరొకరు రెవెన్యూ బాధ్యతలు చూస్తుంటారు. రెండు వారాల్లోనే ఇద్దరు అదనపు కలెక్టర్లు జిల్లా నుంచి బదిలీపై వెళ్లిపోయారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) వీరారెడ్డిని బదిలీ చేశారు. ఆయన బదిలీపై వెళ్లి పది రోజులు దాటినా ఆయన స్థానంలో కొత్తగా ఎవరినీ నియమించలేదు. ఇక మరో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) భాస్కర్ రావు జిల్లా నుంచి వెళ్లి వారం గడుస్తుండగా ఆయన స్థానంలోనూ ఎవరినీ కేటాయించలేదు. దీంతో పాలనా భారమంతా కలెక్టర్‌పై పడుతున్నది.

### సంక్షేమ శాఖలదీ అదే తీరు..

జిల్లాలో సంక్షేమ శాఖలకు ఇన్‌చార్జి అధికారులే దిక్కయ్యారు. గిరిజన, మైనార్టీ సంక్షేమ శాఖలకు జిల్లా అధికారులే లేరు. ఇతర విభాగాల ఇన్‌చార్జిలతో నెట్టుకొస్తున్నారు. గిరిజన సంక్షేమ శాఖ పోస్టు ఏడాదిన్నరగా ఖాళీగా ఉన్నది. గతంలో పనిచేసిన మంగ్తానాయక్ ఏసీబీకి పట్టుబడటంతో పోస్టు ఖాళీ అయ్యింది. డీఆర్‌డీఓకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఇక మైనార్టీ శాఖ సంక్షేమ శాఖ అధికారి బదిలీపై వెళ్లి ఏడాదిన్నర అవుతున్నది. ఆయన స్థానాన్ని ఇప్పటి వరకు భర్తీ చేయలేదు. బీసీ సంక్షేమ శాఖ అధికారి యాదయ్యకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పజెప్పారు.

### విద్యా శాఖకూ అంతే..

కీలకమైన విద్యాశాఖను సైతం అదనపు బాధ్యతతో కొనసాగిస్తున్నారు. 2021లో డీఈఓగా ఉన్న చైతన్య జైనీ బదిలీపై వెళ్లారు. ఆ తర్వాత నల్లగొండ డైట్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా ఉన్న నరసింహారెడ్డిని కొనసాగించింది. 2022 జూన్ తర్వాత వరంగల్ డైట్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా ఉన్న నారాయణరెడ్డికి డీఈఓగా అదనపు బాధ్యతలు ఇచ్చారు. అప్పటి నుంచే ఆయనే కొనసాగుతున్నారు. జిల్లాలో పూర్తి స్థాయి డీఈఓ లేకపోవడంతో పర్యవేక్షణ కొరవడిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### కుప్పలు తెప్పలుగా ఫైల్స్ పెండింగ్

జిల్లాలో ఇద్దరు ముఖ్య అధికారుల పోస్టులు ఖాళీగా ఉండటంతో ఫైళ్లన్నీ పెండింగ్‌లో పడిపోయాయి. వందల కొద్దీ దస్త్రాలు కుప్పలు తెప్పలుగా పేరుకుపోయాయి. సాధారణంగా అడిషనల్ కలెక్టర్లు ఫైళ్లను అప్రూవ్ చేశాకే.. కలెక్టర్ ఆర్డర్లు ఇస్తారు. కానీ వీరిద్దరూ లేకపోవడంతో ఫైళ్లతో పాటు ఇతర పనులు పెండింగ్‌లో పడిపోతున్నాయి. స్థానిక సంస్థల పరిధిలో ముఖ్యమైన శాఖలన్నీ ఉంటాయి. జిల్లా అధికారులు ఏ నిర్ణయం తీసుకోవాలన్నా, ఏం చేయాలన్నా అదనపు కలెక్టర్‌తో చర్చించాల్సిందే. ప్రస్తుతం ధరణి స్పెషల్ డ్రైవ్ నడుస్తున్నది ఇలాంటి సమయంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ తప్పనిసరి. ఇక వేసవి నేపథ్యంలో అనేక చోట్ల నీటి ఎద్దడి నెలకొంది. సదరు సమస్య పరిష్కరించాలంటే ఉన్నతాధికారుల అనుమతి కావాల్సిందే. ఇక ఎన్నికల సమయం కావడంతో ఏం చేయాలో అర్థంకాక కింది స్థాయి అధికారులు ఇబ్బందులు పడుతున్నారు.



మాట్లాడుతున్న వంగపల్లి శ్రీనివాస్‌మాదిగ

## పారిశుధ్య కార్మికులను పర్మినెంట్ చేయాలి

- టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్‌మాదిగ

ఆలేరు, మార్చి 9 : రాష్ట్ర ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరిస్తున్న కార్యనిర్వాహన శాఖకు సంబంధించిన వివిధ రంగాల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులకు ఒక న్యాయం, పారిశుధ్య కార్మికులకు మరో న్యాయమా అని టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ మాదిగ అన్నారు. ఆలేరులో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యుత్, విద్య, వైద్యం, మైనింగ్ తదితర శాఖల్లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్, కాంటాక్ట్ ఉద్యోగులను పర్మినెంట్ చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం పారిశుధ్య కార్మికులను కూడా పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. దేశాన్ని శుభ్రంగా ఉంచడంలో పారిశుధ్య కార్మికుల పాత్ర మరువలేనిదనానరు. మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు మ్యాన్‌హోల్‌లో దిగి ఊపిరాడక చనిపోయిన సందర్భాలు అనేకం ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మిక చట్టాల ప్రకారం పారిశుధ్య కార్మికులకు అధునాతన పరికరాలు ఇవ్వాలని, వాటి ద్వారానే పనులు చేయించాలని కోరారు. మున్సిపాలిటీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల్లో అత్యధిక శాతం మాదిగలేనని, అందుకే ప్రభుత్వాలు చిత్తశుద్ధి చూపట్లేదని విమర్శించారు. వివిధ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగుల కంటే పారిశుధ్య కార్మికులే తమ ప్రాణాలను ఫణంగా పెట్టి పని చేస్తున్నారని, ముందుగా వారిని పర్మినెంట్ చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి గ్యార నరేశ్, నియోజకవర్గం కో ఇన్‌చార్జి గ్యాదపాక మల్లేశ్, ఆలేరు మండల అధ్యక్షుడు అందె సుధాకర్, ఆత్మకూరు మండల అధ్యక్షుడు మందుల పరశురాములు, మండల ప్రధాన కార్యదర్శి రాంచర్ల సిద్దులు, ఆలేరు పట్టణ అధ్యక్షులు రాగళ్ల విజయ్, ఎంఎస్‌ఎఫ్ జిల్లా నాయకులు బోడ నరేశ్, సైదాపురం సురేశ్ పాల్గొన్నారు.

## తల్లిదండ్రులకు తప్పిపోయిన బాలుడి అప్పగింత

బీబీనగర్, మార్చి 9 : మండలంలోని పడమటిసోమారం గ్రామంలో తప్పిపోయి పోలీసులకు దొరికిన బాలుడి వివరాలు లభ్యమయ్యాయి. పోలీసులు బాలుడిని తల్లికి అప్పగించారు. హైదరాబాద్‌లోని బండ్లగూడకు చెందిన ఆసియా బేగం అక్కడి పోలీస్‌స్టేషన్‌లో బాలుడు తప్పిపోయినట్టు ఫిర్యాదు చేశారు. అనంతరం చైల్డ్ హెల్ప్‌లైన్ నంబర్ 1098లో సంప్రదించగా బాలుడు యాదాద్రి శిశు సంక్షేమ శాఖ అధికారుల సమక్షంలో ఉన్నట్లు తెలిపారు. బాలుడి తల్లి జిల్లా బాలల సంరక్షణ అధికారుల ముందు శుక్రవారం హాజరు కాగా, అధికారుల సమక్షంలో బాలుడిని ఆమెకు అప్పగించారు. కార్యక్రమంలో బాలల సంరక్షణ సమితి చైర్మన్ బండారు జయశ్రీ, సభ్యులు రోహిత, ఇస్తారి, జిల్లా బాలల పరిరక్షణ అధికారులు సైదులు, చైల్డ్ హెల్ప్‌లైన్ నంబర్ 1098 కో ఆర్డినేటర్ దశరథ పాల్గొన్నారు.